క్లుప్తంగా

శ్మశానవాటిక స్థలాన్ని స్వాధీనం చేసుకోండి



తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న కుందుర్పి గ్రామస్తులు

కుందుర్పి: మండల కేంద్రంలోని ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని ఇటీవల కొందరు దురాక్రమణ చేసుకొని పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారని, స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. 15వేల జనాభా ఉన్న కుందుర్పిలో నేటికీ శ్మశాన వాటిక లేదని, మృతదేహాలను వంకలు వాగుల్లో పూడ్చుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో లక్ష్మణమూర్తి, ప్రసాద్, నాగరాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన



వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా సర్వేయర్ రూప్లానాయక్

కూడేరు: కూడేరులో ఏపీఐఐసీకి కేటాయించిన సర్వే నంబర్ 535లో 350 ఎకరాలను జిల్లా సర్వేయర్ రూప్లా నాయక్ మండల రెవెన్యూ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఏపీఐఐసీకి కేటాయించిన భూమి హద్దులను పరిశీలించారు. ఎంత మంది ఈ భూమిలో ఎంత మేరకు భూఆక్రమణ చేసి ఉంటారని, అందులో ఏ రకం పంటలు సాగు చేసి ఉంటారని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అరవకూరు, కూడేరు, కడదరకుంటకు చెందిన సుమారు 40 మందికి పైగా భూఆక్రమణ చేసినట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా వివరించారు. అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి నుంచి ఈ భూమికి నేరుగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో డీఐటీఎస్ గుప్తా, మండల సర్వేయర్ అయేషా సిద్ధిక్ , కమ్యూనిటీ సర్వేయర్ వశీం, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీనీ పరిష్కరిస్తాం



రంగసముద్రంలో రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

గుమ్మఘట్ట: రైతుల అర్జీలన్నీ పరిష్కరిస్తామని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని రంగసముద్రం గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాని అర్జీలకు ఆర్డీఓ స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్నదమ్ముల భాగపరిష్కారం కోసం1, రస్తా సమస్య కోసం1, సర్వే కోసం 4 వినతులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ రఘు, వీఆర్వోలు, దేవదాయ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బెళుగుప్ప: మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు మహిళా చట్టాలు,సైబర్ నేరాలపై రూరల్ సీఐ చిన్న గౌస్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ శివతో కలిసి అవగాహన కల్పించారు. డయల్ 100, 112 నెంబర్లకు తెలియజేసి రక్షణ పొందొచ్చని సీఐ తెలిపారు.

ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం

- మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న టీపీఎస్ మురళీమోహన్

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగ సమస్యలపై ఓపెన్ ఫోరం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఎస్ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం జరిగింది. టౌన్ ప్లానింగ్ సమస్యలపై 10 మంది అర్జీదారులు హాజరయ్యారు. ప్లాన్ మంజూరుకు సంబంధించి సందేహాలను అధికారులతో నివృత్తి చేసుకున్నారు. టీపీఎస్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓపెన్ ఫోరం జరుగుతుందన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అనుమతులు, సమస్యలు తెలుపడమే కాక సలహాలు, సూచనలు అందజేయొచ్చన్నారు.

ప్రణాళికతో ఫలితమొచ్చేనా?

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ అధికారులు డిసెంబర్ 1 నుంచే ఈ వందరోజుల ప్రత్యేక కార్యక్రమ కార్యాచరణ ప్రారంభించారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులు పరీక్షలకు చదువుతున్నారు. ఈ పాటికే పూర్తి కావాల్సిన సిలబస్.. కొన్నిచోట్ల ఇంకా మిగిలే ఉంది. వందరోజుల ప్రణాళిక సరే.. సిలబస్ పూర్తి చేసి, వందశాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల కోసం వందరోజుల ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం గంటపాటు స్టడీ అవర్స్, పునశ్చరణ పరీక్షలు
- వందశాతం ఉత్తీర్ణత, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

జెడ్పీ ఉన్నత పాఠశాలలు , పదోతరగతి విద్యార్థుల సంఖ్య...

నియోజకవర్గం	విద్యార్థులు	పాఠశాలలు
రాయదుర్గం	3,894	51
కళ్యాణదుర్గం	2,849	31
ఉరవకొండ	3,250	51
మొత్తం సంఖ్య	9,993	133



బీజీ తిలక్ హైస్కూల్‌లో స్టడీ అవర్స్‌లో నిమగ్నమైన పదో తరగతి విద్యార్థినులు



ఉరవకొండ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్/ఉరవకొండ: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 133 ప్రభుత్వ హైస్కూళ్లలోని 9,993 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. విద్యాశాఖ అందజేసిన ప్రణాళిక మేరకు ఫలితాల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటి దాకా దాదాపు 80 శాతానికిపైగా సిలబస్ పూర్తికాగా నిర్దేశించిన గడువులోపు మిగిలిన సిలబస్ పూర్తి చేసి, వంద రోజుల ప్రణాళికపై మరింత దృష్టి సారించనున్నారు.

వంద రోజుల ప్రణాళిక ఇలా...

రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఓ పాఠ్యాంశానికి సంబంధించి సబ్జెక్ట్ టీచర్ చదివించాలి. అదే అంశంపై మధ్యాహ్నం 4 నుంచి 5 గంటల వరకు పునశ్చరణ పరీక్ష పెట్టాలి. సబ్జెక్టు నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొని పరీక్ష నిర్వహించాలి. వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భోజన విరామ సమయం తర్వాత 4 గంటల వరకు ఇద్దరు సబ్జెక్టు నిపుణుల ఆధ్వర్యంలో రోజూ ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. ప్రతి పాఠ్యాంశానికీ ముఖ్య ప్రశ్నలు, బిట్స్ తయారు చేసి ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులతో వాటికి సమాధానాలు రాయించాలి. వంద రోజుల ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం కూడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. కేవలం పండగ సెలవులు మినహా మిగతా అన్ని రోజులు తరగతులు సాగాలి. సంక్రాంతి సెలవుల్లోనూ ఇంటి వద్దే చదువుకునేలా విద్యార్థుల సందేహాలను మొబైల్ ద్వారా ఉపాధ్యాయులు నివృత్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రణాళికతో శిక్షణ



విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రణాళికతో స్టడీ అవర్స్, సబ్జెక్టుల వారీగా పరీక్షలకు చర్యలు తీసుకుంటున్నాం. అదనపు తరగతులతో బోధన జరుగుతోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నాం. వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థులపై అధిక శ్రద్ధ వహించి శిక్షణ ఇస్తున్నాం. – రామాంజనేయులు, హెచ్‌ఎం, బీజీ తిలక్, మున్సిపల్ హైస్కూల్

వందశాతం ఫలితాలే లక్ష్యం



వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా వందరోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నాం. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వంద రోజుల ప్రణాళిక ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటికే త్వరితగతిని సిలబస్ కూడా పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులను ఆదేశించాం. క్రమం తప్పకుండా ప్రణాళిక మేరకు ప్రత్యేక తరగతులు, పునశ్చరణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి. – ప్రసాద్‌బాబు, జిల్లా విద్యాశాఖాధికారి, అనంతపురం

స్టడీ అవర్స్ ఉపయోగపడుతున్నాయి



ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ బాగా ఉపయోగపడుతున్నాయి. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులకు పైగానే సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది, వారు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. – ధనుష్, 10 తరగతి, జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల, ఉరవకొండ

మంచి ఫలితాలు సాధించేందుకు కృషి



పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నాం. ఇప్పటికే రోజుకో ఉపాధ్యాయురాలిని టైం టేబుల్ ప్రకారం నియమించి స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తున్నాం. పంచతంత్ర కార్యచరణను పక్కగా అమలు చేస్తున్నాం. స్లిప్‌టెస్టులు నిర్వహించి, వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. – ధనలక్ష్మి ప్రిన్సిపాల్, కేజీబీవీ స్కూల్, ఉరవకొండ

పర్యవేక్షణ చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఉన్నత పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహణ పై పర్యవేక్షిస్తున్నాం. విద్యాశాఖ ఇచ్చిన 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. పరీక్షల సమయం తక్కువ ఉండటంతో విద్యార్థులను సెలవు రోజుల్లో నిర్వహించే తరగతులు, స్టడీ అవర్స్‌కు పంపించాలి. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు సహకరించాలి. – ఈశ్వరప్ప, మండల విద్యాశాఖ అధికారి, ఉరవకొండ

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు

మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధన చేస్తున్నారు. ఉదయం చదివించి సాయంత్రం సబ్జెక్టుల వారిగా పరీక్షలు పెడుతున్నారు. మేము కూడా వందశాతం మార్కులు సాధించేందుకు సన్నద్ధమవుతున్నాం. – ఎం.రాధిక, టెన్త్‌క్లాస్, బీజీ తిలక్ మున్సిపల్ స్కూల్

నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

రాయదుర్గం: నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించనున్నారు. సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేయనున్నారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలకు తరలిరండి

ఉరవకొండ: పట్టణంలో శనివారం జరిగే మాజీ సీఎం , వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం వేడుకలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీశ్రేణులు ఓ ప్రకటనలో పిలుపునిచ్చాయి. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్, యువనేత వై.ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొని నివాళులర్పించిన అనంతరం భారీ కేక్ కట్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కంబదూరు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్డు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు కార్యకర్తలు,నాయకులు, పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ, సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి

కంబదూరు: పార్లమెంట్‌లో రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం మండల ఉపాధ్యక్షుడు కురాకులపల్లి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంఘం నాయకులు నిరసన తెలియజేశారు. సంఘం నాయకులు జక్కిరెడ్డిపల్లి నరసింహులు, ప్రతాప్, గురుమూర్తి, వెంకటేశులు, రవి, రామాంజనేయులు, అభి, కార్తీక్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలి

కళ్యాణదుర్గం రూరల్: కేంద్ర మంతివర్గం పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని వీసీకే జాతీయ అధ్యక్షుడు తిరుమవళవన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. చిత్తశుద్ధి ఉంటే అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాలూకా ఇన్‌చార్జ్ కామాక్కపల్లి మరెన్న, కన్వీనర్ కొత్తూరు బొమ్మన్న, రవికుమార్, పాల్గొన్నారు.







సంక్షిప్త సమాచారం

అంబేడ్కర్‌ను కించపరిచే వ్యాఖ్యలు తగవు

కూడేరు: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు మండి పడ్డారు. శుక్రవారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యలను బట్టి చూస్తే బీజేపీ నిజ స్వరూపం బయటపడుతోందన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజు, లక్ష్మన్న, దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, దళిత నాయకులు పరమేష్, రమణ, ముత్యాలు, రామాంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

భారతజాతికి అవమానం

గుమ్మఘట్ట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను చులకన చేసి మాట్లాడడం భారతజాతికే అవమానమని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు రామచంద్ర మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతపై అవమానించేలా మాట్లాడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబేడ్కర్‌పై అమిత్‌షాకు ఏపాటి గౌరవం ఉందో బయటపడిందన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అభాగ్యులు, నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అభాగ్యులు, నిరాశ్రయులు, యాచకులకు చేంజ్‌ఫర్ సొసైటీ టీం సభ్యులు కుమారి, మహేశ్వరీ, భారతి, రోజా, అనిత ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. హోండా షోరూం బండి యశస్వీ దాత సహకారంతో ఆకలి బంధం సేవా సంస్థ సభ్యులు నాగయ్య, మారేష్, వన్నూరుస్వామి, సురేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

వ్యాధుల బారినపడకుండా చైతన్య పరచండి

కూడేరు: ప్రజలు వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రతలను వివరించి చైతన్య పరచాలని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన కొర్రకోడులోని హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. చలి తీవ్రతతో జలుబు, దగ్గు,జ్వరం బారిన పడే అవకాశం ఉందని, చలి నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవిద్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

బొమ్మనహాళ్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ మునివేలు తెలిపారు. శుక్రవారం మండలంలోని కల్లుదేవనహళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ 16 వినతులు స్వీకరించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, ఆర్‌ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరుకావాలి

కళ్యాణదుర్గం రూరల్: రెవెన్యూ అధికారులు విధులకు సక్రమంగా హాజరుకావాలని ఆర్డీఓ వసంత్‌బాబు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కుందిర్పి మండలంలోని రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సర్వే అంశాలపై సమీక్షించారు. ఆర్డీఓ వంసత్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని భూ సమస్యలను రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించనున్నట్లు తెలిపారు.

గ్రామీణులకు వైద్యసేవలు అందించాలి

బ్రహ్మసముద్రం : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందించాలని ఏడీఎంహెచ్ఓ సుజాత ఆదేశించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఏడీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం స్టాటిస్టికల్ అధికారి మహ్మద్ రఫీ పీహెచ్‌సీ వైద్యులు రాజేష్ , అబ్తాప్ , సూపర్‌వైజర్లు మేరీ, రామలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ ఎంలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ పాల్ రవికుమార్

రాయదుర్గంటౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మెర్సి జ్ఞానసుధతో కలిసి ఆస్పత్రికి వచ్చిన రోగులతో వైద్య సేవలపై విచారించారు. అనంతరం రోగులకు సరఫరా చేసే భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యత లోపించకుండా చూసుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వసుంధర సమస్యలను డీసీహెచ్ దృష్టికి తెచ్చారు. వైద్యులు ఉమామహేష, మోహన్‌సాయి పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు

కూడేరు: అయోడిన్ లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (ఐజీడీ) జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య తెలిపారు. శుక్రవారం గొటుకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఆశీర్వాద ప్రాజెక్ట్ సహకారంతో అయోడిన్ లోపంతో కలిగే ఇబ్బందులపై కళాజాతా బృందంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశా లత, ఐజీడీ అధికారులు సుదర్శన్ రెడ్డి, మహమ్మద్, రహీన, పోతులయ్య, రమణమ్మ, ప్రముఖ కళాకారుడు తరిమెల రాజు, ఏఎన్‌ఎం భాను పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

కణేకల్లు: పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని యర్రగుంట లో వివిధ కాలనీల్లో ప్రజలకు స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం డ్రై డే ఫ్రై డేపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఎం అలివేలమ్మ, హెల్త్ అసిస్టెంట్ రఘు, ఎంఎల్‌హెచ్‌పీ కస్తూరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో దోమల నివారణ

కూడేరు: దోమ కాటుతోనే మలేరియా వస్తుందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎస్సీఎస్ నగర్‌లో ఆయన మండల వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఇక్కడ అనంతపురం, కర్నూలు, పుట్టపర్తి, నంద్యాల, తెలంగాణకు చెందిన క్యాడెట్లు శిక్షణ పొందుతారన్నారు. మలేరియా యూనిట్ సూపర్ వైజర్లు నూర్ బాషా, శ్రీధర్ మూర్తి, హెచ్‌ఈ సూపర్ వైజర్ రవీంద్ర, ఏఎస్‌ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంటసాగుపై అవగాహన

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట చెరువు కింద రబీ సీజన్‌లో ఆయకట్టు కింద పంట నీరు ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భూగర్భజలశాఖ అధికారులు రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భూగర్భజలశాఖ అధికారి అప్పలనాయుడు పంట నీరు ప్రణాళికపై సలహాలు, సూచనలు ఇచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షిత ప్రసవం

శెట్టూరు: ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షితమైన ప్రసవం అవుతుందని డాక్టర్ తరుణసాయి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేశారు. సీహెచ్‌ఓలు శోభాలత, సుధామణి, ల్యాబ్ టెక్నీషియన్ మంజునాథ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ మౌనిక, కరియమ్మ, కవిత రాణి, ఆశాలు పాల్గొన్నారు.

గజలక్ష్మి ఆలయంలో విశేష పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు గావించారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

